సాక్షి
సూర్యాపేట
శుక్రవారం। 5। మే। 2023



అందరూ బాగుంటారు
గ్రామాల్లో గుడి, బడి బాగుంటేనే అందరూ బాగుంటారని హర్యానా గవర్నర్ దత్తాత్రేయ అన్నారు. - 8లో



తడిసిన ధాన్యం కొనాలి
వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33°/24°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాలుగు సెంటర్లలో 'నీట్'

సూర్యాపేట టౌన్ : ఈ నెల 7వ తేదీన సూర్యాపేట పట్టణంలోని మూడు కేంద్రాలు, చిల్లేపల్లిలోని ఒక కేంద్రంలో నీట్ – 2023 నిర్వహించనున్నట్లు నీట్ కో ఆర్డినేటర్ తెలిపారు. పరీక్షకు సూర్యాపేటలోని ఎం ఎస్సార్ పాఠశాలలో 270 మంది విద్యార్థులు, అంజలి స్కూల్‌లో 217 మంది, కాకతీయ స్కూల్‌లో 192 మంది, చిల్లేపల్లి సిటీ టాలెంట్ స్కూల్‌లో 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి రావాలని.. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత లోపలికి ప్రవేశం ఉండదని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ ఐడీ కార్డు, హాల్ టికెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఉద్యోగులు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిఉండాలి



కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పరిపాలనా సౌలభ్యంలో భాగంగా జిల్లాలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ యస్.వెంకట్రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వివిధ విభాగాల పర్యవేక్షకులకు ల్యాప్‌ట్యాప్‌లను అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రాజేంద్రకుమార్, ఏఓ శ్రీదేవి, పర్యవేక్షకులు సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్, పద్మారావు, హేమమాలిని, శంకరయ్య సిబ్బంది పాల్గొన్నారు

డ్రా పద్ధతిలో విద్యార్థుల ఎంపిక



డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : 2023–24 విద్యా సంవత్సరానికి రాష్ట్ర రాజధాని నగరంలోని రామంతాపూర్, బేగంపేటలోగల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశాలకు జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. జిల్లాలో రెండు సీట్లు కేటాయించగా ఇద్దరు విద్యార్థులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి దయానందరాణి, తదితరులు పాల్గొన్నారు.

జంగ్ సైరన్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పొట్ల నాగేశ్వర్‌రావు

భానుపురి (సూర్యాపేట) : మే 8న హైదరాబాద్‌లో నిరుద్యోగ నిరసన జంగ్ సైరన్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, పీసీసీ ఉపాధ్యక్షుడు పొట్ల నాగేశ్వరరావు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణకు తొలిసారిగా వస్తున్న ప్రియాంక గాంధీ పర్యటన సందర్భంగా జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. తెలంగాణలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగే నిరుద్యోగ నిరసన భారీ బహిరంగ సభలో ప్రియాంక గాంధీ ఉద్యోగులు, నిరుద్యోగుల ఇబ్బందులపై ప్రసంగించనున్నారన్నారు. రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ తరహాలోనే యూత్ డిక్లరేషన్‌ను ప్రకటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కొప్పుల వేణారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైరు శైలేందర్ గౌడ్, కోతి గోపాల్ రెడ్డి, ధారవత్ వీరన్న నాయక్, కందాల వెంకట్ రెడ్డి, సయ్యద్ ఇమ్రుద్దీన్, పాలగాని బాలు గౌడ్, రుద్రంగి రవి, వాసు, జానయ్య పాల్గొన్నారు.

పల్లెపాలనపై సమ్మెట



చిలుకూరులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- సమ్మెలో జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు
- పారిశుద్ధ్యం, ఉపాధిహామీ, హరితహారంపై కొరవడిన పర్యవేక్షణ
- ఇన్‌చార్జిలను నియమించినా సరిగా అందని సేవలు
- వారం రోజులుగా ఇబ్బందులు

గ్రామ పంచాయతీలు	475
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు	336
ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు	48
సీనియర్ కార్యదర్శులు	91



ఈ ఫొటోలో కన్పిస్తున్న వ్యక్తి పేరు తిప్పన శ్రీను. సొంతూరు చిలుకూరు మండలంలోని నారాయణపురం. ఇతనికి తన ఇంటి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఓనర్‌షిప్ సర్టిఫికెట్ అవసరముంది. దీనికోసం గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేయడానికి ఐదారు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి సమ్మెలో ఉండటం.. ఇన్‌చార్జ్‌గా నియమించిన అధికారికి రెండు మూడు గ్రామాలకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో సమయానికి అందుబాటులో ఉండలేకపోతున్నాడు. దీంతో బాధితుడికి ఎదురుచూపులు తప్పడంలేదు.

చిలుకూరు: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ , ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టడంతో పల్లెల్లో పాలనకు విఘాతం కలుగుతోంది. ఏడు రోజులుగా విధులకు దూరంగా ఉండడంతో ఉపాధిహామీ పథకం అమలు, కూలీల హాజరు, హరితహారం, పారిశుద్ధ్యం తదితర పనుల నిర్వహణలో ఇబ్బందులు తప్పడంలేదు. పౌరసేవలూ అందని పరిస్థితి నెలకొంది.

సమస్యలను పట్టించుకునేవారే కరువు

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 384 మంది జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. మొదటి నుంచి చాలా వరకు పనులు వీరే చూసుకునేవారు. అయితే ఈ నెల 28 నుంచి వీరు సమ్మె చేస్తున్నారు. ప్రస్తుతం సమ్మెలో ఉండడంతో సమస్యలను, పారిశుద్ధ్యం గురించి పట్టించుకునే వారే లేరు. ప్రధానంగా మేజర్ గ్రామ పంచాయతీల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడింది. పన్నుల వసూళ్ల నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఇతర అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. రెగ్యులర్‌గా పని చేసే కొద్ది మంది పంచాయతీ కార్యదర్శులను ఇతర గ్రామాల్లో విధులు నిర్వర్తించాలని ఆదేశించింది. ఒక్కొక్కరికి రెండు,మూడు గ్రామాలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కొన్ని చోట్ల మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల సిబ్బందికి, ఉపాధి హామీ సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

- ప్రతి నెలా వృద్ధులకు ఆసరా పంపిణీ చేయాల్సి ఉంటుంది. బయటికి నడవలేని వారి పింఛన్లను కార్యదర్శులు వేలిముద్రలు ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. వారందరికీ ఇప్పుడు పంపిణీ నిలిచిపోనుంది.
- ఉపాధిహామీ పథకంలో కార్యదర్శుల పర్యవేక్షణలోనే హాజరు నమోదు ఉంటుంది. కార్యదర్శులు లేకపోవడం వల్ల అవకతవకలకు ఆస్కారం ఏర్పడనుంది.
- జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి అనుమతులు నిలిచిపోయాయి.
- నర్సరీల్లో మొక్కల పెంపకం, కూలీలపై పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. మొక్కలకు నీళ్ల పోయించాల్సిన బాధ్యత కార్యదర్శులపైనే ఉంది. ఈ బాధ్యత కూడా సమ్మెతో నిలిచిపోయింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం



పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు వెళ్లడంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. రెగ్యులర్ కార్యదర్శులతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, కొన్ని చోట్ల ఉపాధిహామీ అధికారులకు బాధ్యతలు అప్పగించాం. గ్రామాల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.
–యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి

నేడు బుద్ధ జయంతి ఉత్సవం



నాగార్జునసాగర్‌లో బుద్ధవనంలోని మహాస్థూపం

- హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వరకు 200 కార్లతో ర్యాలీ
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న యూజీసీ మాజీ చైర్మన్ సుఖదేవ్‌థోరట్

నాగార్జునసాగర్: కృష్ణాతీరం నాగార్జునసాగర్‌లో 274 ఎకరాలలో నిర్మితమైన బుద్ధవనంలో శుక్రవారం బుద్ధ జయంతి ఉత్సవం జరగనుంది. బుద్ధవనాన్ని బౌద్ధవారసత్వ థీమ్‌గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దింది. బుద్ధ జయంతిని పురస్కరించుకొని బుద్ధునిపాదాల వద్ద బౌద్ధ భిక్షువులు ప్రార్థనలు చేస్తారని, అనంతరం వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథి పూర్వ యూజీసీ చైర్మన్ సుఖదేవ్‌థోరట్ టిబెటన్ పాల్గొంటారని బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద ఇటీవల ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహం నుంచి శుక్రవారం ఉదయం 8 గంటలకు 200 కార్లతో ర్యాలీ ప్రారంభమవుతుందని, దీనిని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ నిర్వహిస్తున్నట్లు మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. ఈ ర్యాలీ మధ్యాహ్నం ఒంటి గంటకు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనానికి చేరుకుంటుందని చెప్పారు. సాయంత్రం ఐదు గంటలకు బుద్ధవనంలోని బుద్ధుని పాదాల వద్ద, మహాస్థూపంలో బౌద్ధభిక్షువుల ప్రార్థనలు అనంతరం మహాస్థూప సమావేశ మందిరంలో జరిగే సభలో బుద్ధజయంతి ప్రాముఖ్యతపై ధమ్మవచనం ఉంటుందని తెలిపారు. ఆచార్య సుఖదేవ్‌థోరట్ 'బౌద్ధ తాత్వికత–జాతీయ సమ్మిళిత–ప్రజాస్వామ్య పరిరక్షణ' అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

చిలుకూరు: ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటా చలం సూచించారు. చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అనంతరం .. మండలంలోని నారాయణపురం ఎస్సీకాలనీ వాసులు వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారని తెలిసి డీఎంహెచ్‌ఓ అక్కడికి వెళ్లారు. కాలనీలో ప్రజలను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను సక్రమంగా అందించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఆయన వెంట డీఐఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్లు ధర్మతేజ, నవ్య, సావిత్రి, సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, యాదగిరి, సైదులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

తొలిమెట్టు తరహాలో..

- ఉన్నత విద్య మెరుగునకు 'లిప్'
- 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల కోసం నిర్వహణ
- అభ్యసన సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా ప్రణాళిక
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుకు సన్నాహాలు



తూర్పుగూడెం ప్రాథమిక పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

సూర్యాపేటటౌన్ : కరోనా అనంతరం విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు బాగా తగ్గాయి. ఈ విషయాలను పలు సర్వేలు వెల్లడించాయి. ఇందుకోసం ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు కార్యక్రమం అమలు చేస్తుండగా.. ఇదే తరహాలోనే ఉన్నత పాఠశాలల్లోనూ అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం)ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాకు చెందిన విద్యా నిపుణులకు హైదరాబాద్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం విడతల వారీగా జిల్లా, మండల స్థాయిలో శిక్షణలుంటాయి.

318 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో..

జిల్లాలో 234 ఉన్నత, 84 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 40వేల మందికి పైగా విద్యార్థులు 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్నారు. ఈ విద్యార్థులు 2020–21 విద్యా సంవత్సరం నుంచి రెండేళ్ల పాటు కరోనా కారణంగా బడికి రాలేదు. కేవలం డిజిటల్ తరగతులు విన్నారు. ఇలాంటి వారిలో విద్యా సామర్థ్యాల పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. తెలుగు, అంగ్లం అనర్గళంగా చదవలేని వారున్నారు. వీరందరిలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు 'లిప్' ఉపయోగపడనుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదివించడం, పాఠం వినేలా చేయడం, సాధనల్లో పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు, స్లిప్‌టెస్టుల నిర్వహణ, రాత పనులు అతర్భాగంగా చేసేలా కార్యాచరణ రూపొందించనున్నారు. భాషా నైపుణ్యాలను మెరుగు పరచడంతో పాటు, ఇతర సబ్జెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

అధికారుల ఆదేశాల మేరకు కార్యాచరణ



తొలిమెట్టు తరహాలోనే లిప్ ఉంటుంది. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు ఈ కార్యక్రమం అమలు చేయనున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కార్యాచరణ చేపడతాం.
– అశోక్, డీఈఓ

ప్రాథమిక పాఠశాలల్లో సత్ఫలితాలు రావడంతో..

గత విద్యా సంవత్సరం ఆగస్టు 15 నుంచి జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేశారు. మూడేళ్ల పాటు అమలు చేసే ఈ కార్యక్రమంలో మొదటి ఏడాది తెలుగు, ఇంగ్లిష్, గణితంపై ప్రత్యేకంగా రూపొందించిన మాడ్యూల్స్ ఆధారంగా బోధించారు. దీంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడినట్టు అధికారులు గుర్తించారు. విద్యార్థుల సామర్థ్యం పరీక్షించేందుకు స్కూల్ కాంప్లెక్స్, మండల, జిల్లా స్థాయిలో హెచ్ఎంలతో బృందాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఇదే తరహాలో లిప్‌ను కూడా పకడ్బందీగా అమలు చేయనున్నారు.

● లక్ష మల్లికా పుష్పపూజ.. ఎదుర్కోళ్లు



మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు తదితరులు

బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు కష్టాలు

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మిగులు భూములు పంచుతాం
- నిరుద్యోగులకు భృతి ఇస్తాం
- ప్రభుత్వ భూముల నుంచే రీజినల్ రింగ్ రోడ్డు
- పీపుల్స్ మార్చ్ కార్నర్ మీటింగ్‌లో భట్టివిక్రమార్క



భువనగిరిలో పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

భువనగిరి టౌన్: పేదలను ఇబ్బందులను గురిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పేదలు తగిన బుద్ధిచెబుతారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన భూములను ఈ ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటున్నదని విమర్శించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఆయన గురువారం రాత్రి భువనగిరి అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాటాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉన్న మిగులు భూములు అన్నింటిని పేదలకు పంచుతామని, అసైన్డ్ కమిటీలను తిరిగి పునరుద్ధరిస్తామని ప్రకటించారు. ఎన్ని కుట్రలు చేసిన బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రాదన్నారు. తెలంగాణ ప్రజలు సంపద దోపిడీ చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడం త్వరలోనే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే రీజినల్ రింగ్‌రోడ్డు ప్రభుత్వ భూముల గుండా రోడ్డు పోయే విధంగా చేస్తామని, ప్రస్తుతం భూములు కోల్పోయిన రైతులకు తిరిగి పంపిణీ చేస్తామన్నారు. భువనగిరి బైపాస్ రోడ్డులో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను గుంజుకొని ప్రభుత్వం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నిర్మాణానికి కేటాయించడం దుర్మార్గమని అన్నారు. భువనగిరి అర్బన్‌కాలనీలోని రైల్వే గేట్ సమస్యను పరిష్కరించేందుకు నల్లగొండ ఎంపీ ఉత్తంకుమార్ రెడ్డి కృషి చేస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రశ్న పత్రాలు లీక్ కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకొని టీఎస్పీఎస్సీ ద్వారా పారదర్శకంగా ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. కాగా, భట్టివిక్రమార్క పాదయాత్ర 600 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జెడ్పీ ఫ్లోర్ లీడర్ కుడుదుల నగేష్, పాదయాత్ర ఇంచార్జ్ తాహేర్‌బీన్ అహ్మదాన్, పాల్వాయి స్రవంతి, కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు నీలం పద్మ, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బీర్ల ఐలయ్య, రవికుమార్, ప్రమోద్‌కుమార్, ఎండి మజహర్‌పాషా, జహంగీర్, ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్, భట్టి ప్రత్యేక సమావేశం

నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క భువనగిరిలోని ఓ మైబైల్ షాపులో 15 నిమిషాల పాటు సమావేశమయ్యారు. ఈ నెల 8న ప్రియాంకగాంధీ సభ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చినట్లు సమాచారం. అదేవిధంగా పాదయాత్ర రూట్ మ్యాప్, ఆరోగ్య సమస్యలు తదితర విషయాలను భట్టి విక్రమార్కను ఉత్తమ్ అడిగి తెలుసుకున్నారు.

నేడు పాదయాత్ర ఇలా...

భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం ఉదయం 9 గంటలకు గొల్లగూడెంలో ప్రారంభం అవుతుంది. గొల్లగూడెం గ్రామ నుంచి మగ్దుంపల్లి, పెద్ద పలుగుతండా, గుర్రాలదండి, బట్టుగూడెం, పెద్దరావులపల్లి, గోసుకొండ, రేవనపల్లి మీదుగా పోచంపల్లికి చేరుకుంటుంది. పోచంపల్లి మండలం కేంద్రంలో రాత్రి బస చేస్తారు.

పక్కాగా పొదుపు లెక్క

- మహిళా సంఘాల వివరాల నమోదుకు లోకోస్ యాప్
- పారదర్శకత కోసం రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి



లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక వ్యవహారాలు, రుణాలు, వాయిదాల చెల్లింపుల వంటి వివరాలు ఇక నుంచి పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 'లోకోస్' (ప్రజా నిర్వహణ ఆపరేట్ సిస్టమ్) యాప్‌లో మహిళా సంఘాల వివరాలు పొందుపరిచేందుకు జిల్లా స్థాయిలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో సిబ్బందికి శిక్షణ పూర్తి కాగా.. మండల స్థాయి సిబ్బందికి డీపీఎంల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. గ్రామస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించి ఈ నెల నుంచి యాప్‌ను అమల్లోకి తెచ్చేలా ముమ్మర చర్యలు తీసుకుంటున్నారు.

పారదర్శకత కోసం..

మహిళా సంఘాలు	17,394
సభ్యులు	1,81,954
మండల సమాఖ్యలు	23
గ్రామ సమాఖ్యలు	580

పొదుపు సంఘాల్లోని మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేలా ప్రభుత్వం వారికి రుణాలు అందించి సహకారం అందిస్తోంది. ఈ క్రమంలో తీసుకున్న రుణాలకు వాయిదాల చెల్లింపులు, చేసిన పొదుపులు, ఇతర వివరాలను పక్కాగా నిర్వహించి పారదర్శకంగా ఉండేలా కేంద్రం నూతనంగా లోకోస్ యాప్‌ను రూపొందించింది. ఇందులో మహిళా సంఘంలోని ప్రతి సభ్యురాలి వివరాలతో పాటు రుణాలు, వాయిదాలు చెల్లింపుల వంటి వివరాలు పొందుపరుస్తారు. దీంతో ఎలాంటి లోపాలు లేకుండా లెక్కలు పక్కాగా ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో పొదుపు సంఘాల పర్యవేక్షణను వీఓఏలు, సీసీలు చేసే వారు. వీటిలో అక్కడక్కడా అక్రమాలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఈ సంఘటనలను దృష్టిలో ఉంచికుని మహిళా సంఘాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లోకోస్ యాప్‌ను రూపొ ందించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీనికోసం ఇప్పటికే జిల్లాలోని డీఆర్‌డీఓ, సీబీ ఆడిటర్లు, డీపీఎంలకు శిక్షణ పూర్తిచేయగా, మండల స్థాయి సిబ్బందికి శిక్షణ కల్పిస్తున్నారు. త్వరలో గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ పూర్తిచేసి యాప్‌ను త్వరలోనే అమలు చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తుంగతుర్తి: ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లాక పంచాయతీ అధికారి యాదయ్య హెచ్చరించారు. గురువారం తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కాంటాలను వెంటనే వేయాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు శుభ్రం చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని కోరారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన కాంటా అయిన ధాన్యాన్ని వెనువెంటనే లారీల్లో మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ భీంసింగ్, ఏపీఎం నర్సయ్య ఉన్నారు.

క్లుప్తంగా

చోరీకి గురైన సెల్‌ఫోన్ల అప్పగింత


తమకు అందించిన సెల్‌ఫోన్‌లను చూపుతున్న బాధితులు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 50 మంది సెల్‌ఫోన్‌లను గురువారం ఎస్పీ అపూర్వరావు గురువారం తన కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్‌లు చోరీకి గురైతే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేస్తే ఫోన్‌లను సులభంగా రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. www.ceir.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని, అందులో ఫోన్ వివరాలు, కొనుగోలు చేసిన రశీదు అప్‌లోడ్ చేయాలన్నారు. ఫోన్ లభించిన తర్వాత అదే వెబ్‌సైట్‌లో అన్‌బ్లాక్ చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లను రికవరీ చేసిన టూటౌన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి, పీసీలు బాలకోటి, శంకర్‌లను ఎస్పీ అభినందించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

దేవరకొండ: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన దేవరకొండ మండల పరిధిలోని కొమ్మేపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మేపల్లి గ్రామానికి చెందిన కడారి సత్యనారాయణ(30) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఈయన వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దున్నేందుకు వెళ్తున్న క్రమంలో బాట మధ్యలో కిందికి ఉన్న సర్వీస్ వైర్ తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. కాగా.. మృతుడికి భార్య అనిత, పదేళ్ల లోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.

యాదాద్రిలో సహస్ర కలశాభిషేకం

- ముగిసిన శ్రీస్వామి జయంత్యుత్సవాలు
- పాతగుట్టలోనూ ఉత్సవాలు పరిసమాప్తి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రారంభమైన శ్రీస్వామి వారి జయంత్యుత్సవాలు గురువారం ఉదయం సహస్ర కలశాభిషేకం, రాత్రి నృసింహ ఆవిర్భావంతో ముగిసాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. ఉదయం ప్రధానాలయంలో నిత్య హవనాలు, మూలమంత్ర జపములు, లక్ష్మీసూక్త, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణాలు గావించారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలోని యాగశాలలో మహా పూర్ణాహుతి జరిపించారు.

కలశాలకు ప్రత్యేక పూజలు..
జయంత్యుత్సవాల్లో భాగంగా శ్రీస్వామి ఆలయంలోని ముఖ మండపంలో సహస్ర కలశాలను వరుస క్రమంలో పేర్చి, అందులో శుద్ధజలం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలను నింపారు. వాటికి కలెక్టర్ పమేలా సత్పతి, ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆగమశాస్త్రం ప్రకారం, వేద మంత్రాలతో స్వయంభూలకు సహస్ర కలశాలతో అభిషేకం నిర్వహించారు.

సాయంత్రం వేళ..
ఆలయంలో సాయంత్రం ఆచార్యులు నృసింహ ఆవిర్భావ ఉత్సవాలను నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని అలంకరించి నృసింహ జయంతి మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ నీరాజనం చేసి ఉత్సవ సమాప్తి గావించారు. ఉదయం, సాయంత్రం ఆలయ రథశాల ఎదుట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పాతగుట్టలో..
యాదాద్రీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సైతం శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం జరిపించారు. ఉదయం ఆలయంలో పూర్ణాహుతి, అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. రాత్రి నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి గావించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆలయ ఆచార్యులు, అధికారులు భక్తులు పాల్గొన్నారు.


ఆలయ ముఖ మండపంలో సహస్ర కలశాలు, ప్రధాన కలశానికి పూజలు చేస్తున్న ఆచార్యులు, పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, ఆలయ ఈఓ గీతారెడ్డి, అధికారులు

నేటి నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం
శ్రీనృసింహస్వామి వారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో 2వ తేదీ నుంచి శాశ్వత, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, నారసింహ హోమాలను రద్దు చేశారు. ఉత్సవాలు ముగియడంతో తిరిగి ఈ పూజలను శుక్రవారం నుంచి పునఃప్రారంభించనున్నారు.


శ్రీయాదగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని పూజలు


రాణి కుముదినికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి రాజన్‌బాబు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర కార్మిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆమెకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చీఫ్ సెక్రటరీ రాణి కుముదినికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారి రాజన్‌బాబు లడ్డూ ప్రసాదం అందజేశారు.

గుడి, బడి బాగుంటేనే అందరూ బాగుంటారు

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

మునుగోడు: ప్రతి గ్రామంలో గుడి, బడి బాగుంటేనే ఆ గ్రామంలోని ప్రజలు, ఆ గ్రామం అన్ని విధాలుగా బాగుంటుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మునుగోడు మండలం కోతులారం గ్రామంలోని కేదారేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల చివరి రోజు గురువారం దత్తాత్రేయ హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భక్తి కలిగి ఉండి దేవాలయానికి వెళ్లి పూజలు చేస్తే వారికి సత్ ప్రవర్తన అలవడుతుందని, అలా గ్రామం మొత్తంలో భక్తులు ఉంటే ఆ గ్రామంలో తగువులకు తావు ఉండదన్నారు. సంస్కారం కలిగిన వ్యక్తులు మాత్రమే సమాజంలో ఎదుగుతారని అన్నారు. జీవించడానికి డబ్బు ఒక్కటే ముఖ్యం కాదని, మంచి ఆలోచన, నలుగురికి సహాయపడే గుణం కలిగి ఉండాలన్నారు.


దత్తాత్రేయకు మెమొంటో అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

దేవాలయాన్ని నిర్మించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను దత్తాత్రేయ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, దేవాలయ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష మల్లికా పుష్పపూజ.. ఎదుర్కోళ్లు

- మట్టపల్లిలో వైభవంగా తిరుకల్యాణోత్సవాలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం లక్షమల్లికా పుష్పపూజ, ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని నిర్వహించారు. యాజ్ఞీకులు బొర్రా వెంకట వాసుదేవాచార్యులు పర్యవేక్షణలో వేడుకలు జరిపించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, ద్రవిడ ప్రబంధ సేవాకాలం, మల్లికా పుష్ప సమగ్ర నామార్చనలు చేపట్టారు. నూతన వధూవరులుగా అలంకరించిన స్వామి, అమ్మవార్లను గజ, సింహ, శేషవాహనాలపై కళా మండపానికి తరలించి తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. అదేవిధంగా దాచేపల్లికి చెందిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కోలాట బృందం, గుంటూరు జిల్లా మాచవరం మండలానికి చెందిన వైఎస్ఆర్ కోలాట బృందం, చౌటపల్లికి చెందిన శ్రీలక్ష్మీనరసింహ కోలాట బృందం, అంత్యాతండా, భోజ్యాతండాలకు చెందిన కోలాట బృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉచిత భోజన వసతి..
కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు దేవస్థానం అన్నదానం ఏర్పాటు చేసింది. వివిధ కులాల అన్నదాన సత్రాలు భోజన వసతి కల్పించాయి. పలు సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు తాగు నీరు, అన్నదానం చేశాయి. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఈఓ నవీన్ తదితరులున్నారు.


లక్షమల్లికా పుష్పపూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ
తిరుకల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆలయాన్ని సందర్శించారు. కృష్ణానది వంతెనపై ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. టీటీడీ కల్యాణ మండపంలో పోలీసు అధికారులతో సమావేశంలో నిర్వహించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఇరుగు రవి ఉన్నారు.


అద్దాలమండపంలో పూజలు చేస్తున్న ఎస్పీ

కందూరుకు వచ్చి.. కానరాని లోకాలకు

- ప్రమాదవశాత్తు కృష్ణానదిలో మునిగి బాలుడు మృతి


బాలుడి మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న జాలర్లు

పాలకవీడు: కందూరుకు వచ్చి ప్రమాదవశాత్తు కృష్ణానదిలో మునిగి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన పాలకవీడు మండలంలోని మహంకాళిగూడెం వద్ద కృష్ణానది పుష్కరఘాట్ వద్ద గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చండూరు గ్రామానికి మహ్మద్ హఫీజ్, జానీబేగంలకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు మహ్మద్ హఫ్రజ్ (14), తల్లి జానీబేగంలు జాన్‌పహాడ్ దర్గా వద్ద బంధువులు నిర్వహించిన కందూరుకు వచ్చారు. ఈక్రమంలో దర్గాను దర్శించుకునే ముందు పుష్కర ఘాట్ వద్ద స్నానం చేసేందుకు కృష్ణానది వెళ్లారు. ఒడ్డున స్నానం చేస్తుండగా హఫ్రజ్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన బంధువులు కేకలు వేయడంతో అక్కడే ఉన్న జాలర్లు బాలుడిని బయటకు తీసి, దగ్గరలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమకు చెందిన అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కాగా.. తరచూ ఇలాంటి ప్రమాద ఘటనలు జరుగుతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుష్కర ఘాట్ వద్ద ట్రెంచ్ ఏర్పాటు చేసి సెక్యూరిటీని, గజ ఈతగాళ్లను నియమించాలని కోరుతున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

చౌటుప్పల్: మండల పరిధిలోని తూఫ్రాన్‌పేట గ్రామ శివారులో ఓ వ్యక్తి వద్ద పోలీసులు గురువారం రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌కు చెందిన మహ్మద్ మునావర్‌ఖాన్(32) వృత్తి రీత్యా పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లోని పురాణాపూల్‌లో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తుల వద్ద రెండు కిలోల గంజాయిని కిలోకు రూ.3,500 చొప్పున కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమైన మునావర్ తూఫ్రాన్‌పేట గ్రామ శివారులోని రఫీ టీస్టాల్ వద్దకు చేరుకున్నాడు. స్థానికులకు వంద గ్రాముల గంజాయిని రూ.500లకు విక్రయిస్తున్నాడు. అదే సమయంలో విధుల్లో ఉన్న పోలీసులు గుర్తించారు. అక్కడికి వెళ్లి గంజాయిని స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నకిరేకల్: అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. నకిరేకల్‌లో ఓ శుభకార్యానికి వచ్చిన ఆయన సమీపంలోని నెల్లబండ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని రైతులు వాపోయారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. కేంద్రాల్లో జరుగుతున్న అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారాల తరబడి అక్కడే పడిగాపులు పడుతున్నందున కేంద్రాల్లో గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పండ్ల తోటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిల్లో కదిలిక లేక రైతులు మనోవ్యధకు గురవుతున్నారన్నారు. ఆయన వెంట రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, డీవైఎఫ్ఐ డివిజన్ నాయకులు గడగోజు రవీంద్రాచారి, స్టాలిన్, సురేష్ తదితరులున్నారు.


రైతులతో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

రామన్నపేట: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామన్నపేట మండలంలోని నిదానపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈసం శృతిలయ(22) చిట్యాలలోని ల్యాబ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తోంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. బుధవారం కుటుంబసభ్యులు శోభనాద్రిపురంలో జరిగిన ఉత్సవాలకు వెళ్లారు. ఒంటరిగా ఉన్న ఆమె జీవితంపై విరక్తి చెంది ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి గాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. విషయం తెలుసుకున్న నార్మాక్స్ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

చండూరు: మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో బుధవారం రాత్రి బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం నెల్వపల్లి గ్రామానికి చెందిన రాఘవాచారి (23) పుల్లెంల గ్రామానికి చెందిన తన బంధువు పోలోజు అంజయ్యచారి ఇంట్లో జరుగుతున్న ఎల్లమ్మ పండుగకు బుధవారం వచ్చాడు. రాత్రి బహిర్భూమికి కొండాపూర్ రోడ్‌కు తన బంధువు వేణుమాధవ్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో గ్రామ శివారు దాటగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో రాఘవాచారి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న వేణుమాధవ్ చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఇతను హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకుని వస్తుండగా..

- బ్యాగు లాక్కెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

నార్కట్‌పల్లి: ఓ మహిళ బ్యాంకులో నుంచి రూ.1.50లక్షలను డ్రా చేసుకుని వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన నార్కట్‌పల్లి మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లికి చెందిన ప్రజ్ఞాపురం అనిత మరో మహిళా సంఘం సభ్యురాలితో కలిసి బ్యాంకులో రూ.లక్షా 50 వేలను డ్రా చేసింది. ఆమెతో వచ్చిన మహిళ తన దుకాణానికి వెళ్లింది. అనిత నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె చేతిలో డబ్బులు ఉన్న బ్యాగును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిప్పర్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చివ్వెంల(సూర్యాపేట): ప్రమాదవశాత్తూ టిప్పర్ దగ్ధమైంది. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట– ఖమ్మం రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి బి.చందుపట్ల గ్రామానికి మట్టిలోడుతో వెళ్తున్న టిప్పర్ గ్రామ శివారులోకి రాగానే ఒక్కసారిగా ఇంజన్ నుంచి మంటలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ అప్రమత్తమై టిప్పర్‌ను పక్కకు ఆపి కిందకు దిగాడు. స్థానికులు అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే లోపు వాహనం పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నాడు.

ఉమ్మడి జిల్లాకు మరో కార్పొరేషన్ పదవి

- రాష్ట్ర గీత కార్మిక సహకార, ఆర్థిక సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా పల్లె రవికుమార్‌గౌడ్
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్


పల్లె రవికుమార్

చండూరు : ఉమ్మడి జిల్లాకు మరో కార్పొరేషన్ పదవి దక్కింది. చండూరు మండలం బోడంగిపర్తి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పల్లె రవికుమార్‌గౌడ్‌ను రాష్ట్ర గీత కార్మిక సహకార, ఆర్థిక సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రవికుమార్ రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉండనున్నారు. రవికుమార్ తండ్రి పల్లె లింగయ్య బోడంగిపర్తి గ్రామానికి సీపీఐ నుంచి సర్పంచ్‌గా పనిచేశారు. కమ్యూనిస్టు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన పల్లె రవికుమార్ విద్యార్థి దశలోనే మునుగోడు నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ సమస్య, నిరుద్యోగం, ఉద్యోగాల కల్పన కోసం పోరాడారు. వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. 2001లో టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ప్రస్తుతం 'తెలంగాణ జర్నలిస్టుల ఫోరం' వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 'పీపుల్స్ ఫౌండేషన్' పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రవికుమార్ తొలుత టీఆర్ఎస్ పార్టీలో పనిచేశారు. తర్వాత మారిన పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేశారు. రవికుమార్ సతీమణి కల్యాణి కాంగ్రెస్ నుంచి చండూరు ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మునుగోడు శాసనసభ ఉప ఎన్నిక సమయంలో వీరు తిరిగి టీఆర్ఎస్‌లో చేరారు. రవికుమార్‌కు కార్పొరేషన్ పదవి దక్కడంపై మునుగోడు నియోజవర్గంలోని పలువురు నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేనేత సమస్యలపై నేడు, రేపు దీక్ష


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం తదితరులు

భూదాన్‌పోచంపల్లి : చేనేత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్ర, శనివారం భూదాన్‌పోచంపల్లిలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం తెలిపారు. దీక్షకు సంబంధించిన కరపత్రాలను గురువారం భూదాన్‌పోచంపల్లిలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పురుషోత్తం మాట్లాడుతూ.. చేనేతబంధు పథకాన్ని అమలు చేయాలని, ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కార్మికుల కుటుంబాలకు చెల్లిస్తున్న ఎక్స్‌గ్రేషియాను రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు పెంచాలని కోరారు. వీటితో పాటు ఇల్లు లేని ప్రతి నిరుపేద చేనేత కుటుంబానికి డబుల్ బెడ్‌రూం నిర్మించి ఇవ్వాలని, పోచంపల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా వస్త్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, మూతపడిన పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును పునః ప్రారంభించాలని కోరారు. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు ప్రింటింగ్ చేస్తూ డుప్లికేట్ వస్త్రాలను తయారు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అఖిలపక్ష పార్టీల సహకారంతో చేపట్టనున్న చేనేత దీక్షలో చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు వేశాల మురళి, ప్రధాన కార్యదర్శి గంజి చంద్రయ్య, చేనేత నాయకులు జోగు శ్రీనివాస్, ఏలే శ్రీనివాస్, భారత భూషణం, బింగి భాస్కర్, గజ్జెల రామకృష్ణ, వడ్డేపల్లి విష్ణు, బోడ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు


గూడూరులో ధాన్యం కొనుగోళ్ల వివరాలను పరిశీలిస్తున్న రవీందర్‌సింగ్

బీబీనగర్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని, రైతులు అధైర్యపడవద్దని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ చెప్పారు. బీబీనగర్ మండలంలోని గూడూరు, జైనపల్లి గ్రామాల్లోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. అలాగే భట్టుగూడెంలోని రైస్‌మిల్లులోని ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు మద్దతు ధర కల్పిస్తామని చెప్పారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పది గేదెలు మృతి

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలో గురువారం ఆరు పాడి గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. గ్రామానికి చెందిన దొంగరి అంజయ్యకు చెందిన మూడు గేదెలు, కల్లు కృష్ణారెడ్డి, కల్లు రవీందర్‌రెడ్డి, ఉదర సామెలుకు చెందిన మరో మూడు గేదెలు మేత కోసం పొలాల్లోకి వెళ్లి తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి.

కృష్ణాపురం గ్రామంలో..
మునగాల: మండలంలోని కృష్ణాపు రం గ్రామంలో గు రువారం రైతు కొండ స్వామికి చెందిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె మేత కోసం పొలానికి తీసుకెళ్లగా అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

తక్కెళ్లపాడులో..
మిర్యాలగూడ టౌన్: మండలంలోని తక్కెళ్లపాడులో గురువారం విద్యుత్‌షాక్‌తో మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మద్దెల నరసయ్యకు చెందిన రెండు, దోమలపల్లి వెంకన్నకు చెందిన ఒక గేదె మేతకు వెళ్లాయి. పొలాల మధ్య విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో గేదెలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు.